క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠకు అనుమతి ఇవ్వండి

అయిజ: పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో నూతనంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి ఇవ్వాలని అఖిలపక్షం కమిటీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిపక్షం కమిటీ అధ్యక్షుడు అంజనేయులు మాట్లాడారు. పట్టణంలోని పెద్ద వాగు బ్రిడ్జి పక్కన ఇటీవల చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనుల వల్ల 1991లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం రోడ్డుకు సమాన ఎత్తులో ఉందని, విగ్రహాన్ని ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, సాంబశివుడు, హనుమంతు, ఆంజనేయులు, దేవేందర్, అంజి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాజోళి: మండలంలోని పచ్చర్లలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ జగదీశ్ వివరాల ప్రకారం.. పచ్చర్ల గ్రామంలోని మాబు అనే వ్యక్తి కల్లందొడ్డిలో ఎనిమిది మంది పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకుని ఒక వ్యక్తి పరారు కాగా, మిగతా 7 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,900 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐతో పాటు ట్రైనీ ఎస్‌ఐ సతీష్ కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్వాపురంలో పౌరహక్కుల దినోత్సవం

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలోని పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం డీటీ వెంకట్రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో కులాల పేరుతో దూషించినా, భయబ్రాంతులకు గురిచేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో చోరీ

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు సమీపంలో వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బుధవారం రాత్రి ఆలయం తలుపులు వేసి వెళ్లిన పూజారి సుదర్శనాచారి గురువారం ఉదయం ఆలయానికి వచ్చారు. తలుపులు తెరిచి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. ఆలయంలోని ఆంపిల్‌వైరు దొంగిలించారని, విగ్రహ మూర్తుల వస్త్రాలు చిందరవందర చేసి వెళ్లారని పూజారి వివరించారు. ఆంపిల్‌వైరు రూ.25 వేలు చేస్తుందన్నారు. దొంగలను పట్టుకుని ఆలయానికి రక్షణ కల్పించాలని, గతంలో కూడా ఆలయంలో దొంగతనం జరిగిందని, రాత్రివేళల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పోలీసులను కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలోని కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం ఎర్రమర్స్ గ్రామానికి చెందిన సిద్దప్ప నూతన కల్యాణ మండప నిర్మాణానికి రూ.65వేలు, రాంపురం గ్రామానికి చెందిన భాస్కర్ రూ.50వేలు ఆలయ అభివృద్ధికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, తదితరులు ఉన్నారు.

మార్కెట్ పూర్తయ్యేదెప్పుడో?



పిల్లర్లకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణాల సముదాయం

- రెండేళ్లుగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- పిల్లర్లు వేసి వదిలేసిన వైనం
- రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలు
- దుమ్ము, ధూళిలో ఆహార పదార్థాలు
- ఇబ్బందుల్లో చిరువ్యాపారులు, పట్టణవాసులు

శాంతినగర్: కొత్తగా మున్సిపాలిటీ అయినందుకు సంతోషించాలో, సౌకర్యాలు కల్పించకపోవడంతో బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొంది. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడు ప్రజలకు మున్సిపాలిటీ మంజూరై ఐదేళ్లు గడిచినా పట్టణంలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, మాంసం దుకాణాలు ఒకే చోట ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు బాగుంటుందని సదుద్దేశంతో మున్సిపల్ శాఖ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దుకాణాల సముదాయానికి 2023లో రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. టెండర్‌లో కాంట్రాక్ట్ దక్కించుకున్న హైదరాబాద్ కాంట్రాక్టర్ శాంతినగర్-వడ్డేపల్లి మధ్యలోని ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేందుకు పనులు మొదలుపెట్టాడు. బేస్‌మేట్, పిల్లర్లు వేసి వదిలేశారు. రెండేళ్లు గడిచినా ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. మార్కెట్ నిర్మిస్తే అన్ని దుకాణాలు ఒకే చోట సౌకర్యంగా ఉంటుందని ఆశించిన పట్టణ వాసులకు పిల్లర్లే కనిపిస్తాయి. ఈ విషయమై మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి పట్టణ ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కోట్లు మంజూరైనా

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశాడు. దీంతో మార్కెట్ నిర్మాణ లక్ష్యం నీరుగారిపోయింది. ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆశించి భంగపోయారు.

రోడ్లపైనే కూరగాయలు, మాంస విక్రయాలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తవకపోవడంతో కూరగాయలు, మాంస విక్రయాల దుకాణాలు రాజోళి, రాయచూర్ రోడ్డు, రామాపురం రోడ్డులో కొనసాగుతున్నాయి. వారాంతపు సంతరోజు శుక్రవారం రోడ్లపై క్రయ విక్రయాలు చేయడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయి కూరగాయలు, మాంసం కలుషితమవుతున్నాయి.

మార్కెట్ పనులు త్వరగా పూర్తిచేయాలి



విశాలమైన స్థలంలో మార్కెట్ నిర్మిస్తున్నామని అప్పట్లో ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. మార్కెట్‌ను రోడ్డు సమీపంలో కాకుండా లోపల నిర్మిస్తున్నందున దుమ్ము, ధూళి పడకుండా ఉంటాయని ఆశించాం. రెండేళ్లుగా మార్కెట్ ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తున్నాం. వెంటనే పనులు మొదలుపెట్టి అందుబాటులోకి తేవాలి.

– నర్సింహులు, శాంతినగర్, వడ్డేపల్లి

రోగాల బారిన పడుతున్నాం..



రాజోళి రోడ్డుపై కూరగాయలు, తినుబండారాలు అమ్ముతున్నారు. రోడ్డుపై బీటీ వేయకపోవడంతో ఎప్పుడు దుమ్ము, ధూళి మూసుకుపోతుంది. రోడ్ల పక్కన ఉన్న కూరగాయలు, తినుపదార్థాలపై చేరుతుంది. వాటిని తిన్న వారందరు రోగాల బారిన పడుతున్నారు.

– కె.వెంకటేష్, శాంతినగర్, వడ్డేపల్లి

బిల్లు రాక నిర్మాణం ఆగింది..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపేశారు. పనులు చేయాలని కోరినా కాంట్రాక్టర్ ఒప్పుకోవడంలేదు. బేస్‌మేట్ బిల్లు వస్తేనే పనులు మొదలుపెడతానని చెబుతున్నాడు. బిల్లు వచ్చిన వెంటనే పనులు చేయించి, మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చి పట్టణవాసులకు సౌకర్యం కల్పిస్తాం.

– రాజయ్య, కమిషనర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

అపార్‌ను పూర్తి చేయాలి

అయిజ: ప్రతి పాఠశాలలో అపార్‌ను వందశాతం పూర్తి చేయాలని ఎంఈఓ రాములు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. అపార్‌ను వందశాతం పూర్తి చేసేందుకు విద్యార్థులను మూడు కేటగిరిలుగా విభజించాలని అన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలు సమయానికి పాఠశాలలకు చేరుకోవాలని, ఆలస్యం అయితే సీఎల్ తీసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

గుంత తీశారు.. వదిలేశారు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని డి.బూడిదపాడు నుంచి ఉండవెల్లి వచ్చే రోడ్డు మార్గంలో వెంకట్రామణ కాలనీలో గుంత తీశారు. మిషన్ భగీరథ నీటి కోసమా, లేక దేనికోసమనేది తెలియాల్సి ఉంది. మూడు రోజులైన గుంతను పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయని కాలనీ వాసులు పేర్కొన్నారు. త్వరగా గుంతను పూడ్చేయాలని కోరుతున్నారు.



ఉండవెల్లిలోని వెంకట్రామణ కాలనీలో ప్రమాదకరంగా గుంత

ఉత్సాహంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు

గట్టు: మండలంలోని బల్గెరలో శుక్రవారం ఎడ్ల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. శివరాత్రి అమావాస్య సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సరిత సూచనల మేరకు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు. పోటీల్లో మొత్తం 6 జతల ఎడ్ల బండ్లు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.3016లు సిరనగాళ్ల అయ్యన్న దక్కించుకున్నారు. ద్వితీయ బహుమతి రూ.2016లు రాళ్లకుంట ఈరన్న దక్కించుకున్నారు. తృతీయ బహుమతి రూ.1016లు దోర్నాల వీరేష్ దక్కించుకున్నారు. నాలుగవ బహుమతి రూ.516లు గౌరయ్యగాళ్ల శ్రీనివాస్ దక్కించుకున్నారు. విజేతలకు కాంగ్రెస్ నాయకుడు మాలిపటేల్ కృష్ణారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బజారి, రవి, మొగిలి బసప్ప, నర్సింహులు, కుర్వముక్కెరన్న, వీరన్న పాల్గొన్నారు.



బల్గెరలో నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల గిరక పోటీలు

టీఎల్ఎం బోధన సులభం

శాంతినగర్: టీఎల్ఎం పద్ధతి ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభతరం అవుతాయని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకట నర్సమ్మ అధ్యక్షతన, యంఎఫ్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన టీ ఎల్ఎం మెటీరియల్‌ను పరిశీలించి అభినందించారు. టీఎల్ఎంలు తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రావు, యంఎఫ్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పుష్ప, సీఆర్‌పీఎఫ్ సభ్యులు గాయత్రి శ్రీను, నర్సింహులు, లక్ష్మీదేవి, పద్మావతి, రమాదేవి, రామలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీఆర్‌పీలు పాల్గొన్నారు.



టీఎల్ఎం మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ నరసింహ

ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అమావాస్య పూజలు నిర్వహించారు. కుర్తిరావులచెర్వు, పాల్వాయి, అడవిరావులచెర్వు, శేషంపల్లి, తాటి కుంట, అమరవాయి గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య పూజలు నిర్వహించారు. కొత్త, పాత వాహనాలకు అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, చైర్మన్ ప్రహ్లదరావు, అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి, ధీరేంద్ర దాసు, శశాంక్, చంద్రశేఖర్ రావు, బాబురావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలోని వెలసిన శ్రీ పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బుడిదపాడు ఆలయంలో ఆంజనేయ స్వామికి అమవాస్య సందర్భంగా శుక్రవారం ఆకుపూజ, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఆలయం చుట్టు ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు, పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య పూజలు చేస్తున్న భక్తులు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ధరూరు, ఆల్వాలపాడు, పెద్ద చింతరేవుల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద చింతలరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో అమావాస్య పూజలను నిర్వహించారు. ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో రంజాన్

అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల: ప్రశాంత వాతావరణంలో రంజాన్ మాసం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్షలు మార్చి 2 నుంచి ప్రారంభమవుతున్నందున జిల్లాలో ఉన్న ప్రతి మసీదు, ఈద్గాలలో తాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్ సరఫరా, వీధిలైట్లు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

గురుకుల ఆవరణలో దుర్వాసన



ఉండవెల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో దుర్వాసన వెదజల్లుతున్న స్థలం



చెత్త కాల్చిన స్థలం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు చూడటానికి రాగానే దుర్వాసనకు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు దుర్వాసనకు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దుర్వాసన వల్ల విద్యార్థులు తిండి ఎలా తింటారు? చదువు ఎలా చదువుతారని ప్రశ్నిస్తున్నారు. త్వరగా మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. డంప్ చేస్తున్న చెత్తను కాల్చడంతో పొగ మొత్తం గదులలోకి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీలో పైసా వసూల్

అయిజ: మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వుల కాగితం చూయించి కొందరు వ్యక్తులు డబ్బు వసూలు చేస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ ప్లేటు ప్రతి ఇంటికి ఉచితంగా అమర్చాల్సి ఉండగా, కాంట్రాక్టర్ సిబ్బంది ప్రతి ఇంటికి రూ.60 నుంచి రూ.80 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌పై, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు అడివేశ్వర స్వామి రథోత్సవం

రాజోళి: మండల కేంద్రంలో కొలువైన భ్రమరాంబ అడివేశ్వర స్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవానికి సంబందించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవం అనంతరం జాతర ప్రారంభం కానుంది. దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

ధరూరు: వేసవిలో ప్రతి గ్రామంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ ధరూరు, దోర్నాల గ్రామాల్లోని ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిషనల్ కలెక్టర్ తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలకు పని ప్రాంతాల్లో వసతులను కల్పించడంతో పాటుగా కూలీ చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయి ఎదగాలి

కేటీదొడ్డి: బాల బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వెల్ఫేర్ అఫీసర్ సునంద అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బాలల రక్షణ, సంరక్షణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 తెలియజేస్తూ, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారని, ఈ చట్టంలో బాలబాలికలకు సమానమైన రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డసీపీఓ నరసింహులు, ఉమెన్ హబ్ జిల్లా కో–ఆర్డినేటర్ జోష్న, సోషల్ వర్కర్ పద్మ ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ఎర్రవల్లి: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా సోషల్ ఆడిట్

అయిజ: మండలంలో ఈ ఏడాది నిర్వహించిన ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై ముమ్మరంగా సోషల్ ఆడిట్ కొనసాగుతోంది. శుక్రవారం వివిధ గ్రామాల్లో అధికారులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు మొత్తం రూ.3.77 కోట్లు ఖర్చు చేశారు. దాంట్లో రూ.3.52 కోట్లు ఉపాధి కూలీల వేతనాలకు వెచ్చించగా, మిగిలిన రూ.25 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు చేశారు. దానికి సంబంధించిన సోషల్ ఆడిట్‌లో భాగంగా ఫిబ్రవరి 21 నుంచి 22 వరకు సంబంధిత అధికారులు రికార్డులు పరిశీలించారు. మార్చి 4న మండల కేంద్రంలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

హైవేపై తప్పిన ప్రమాదం

ఎర్రవల్లి: 44వ జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జడ్చర్ల నుంచి కర్నూల్ వైపు డీసీఎం సీఎన్‌జీ గ్యాస్ లోడ్‌తో వెళ్తోంది. జాతీయ రహదారిపై జింకలపల్లి సమీపంలో హైదరాబాద్ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ ఓవర్ టేక్ చేయబోయి డీసీఎంను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో గ్యాస్ డీసీఎం అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. 100ఫీట్లు సమీపంలో జింకలపల్లి ఉండటంతో ఎక్కడ గ్యాస్ పేలుతుందోనని గ్రామస్తులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని రెండు క్రేన్ల సహాయంతో గ్యాస్ డీసీఎంను బయటికి తీసి అక్కడి నుంచి పంపించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

విజ్ఞానం నింపిన వైజ్ఞానిక ప్రదర్శన

- ఘనంగా సైన్స్ దినోత్సవం

సాక్షి, నెట్‌వర్క్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దేశం దూసుకెళ్తోంది. మొన్నటి చంద్రయాన్–3 ప్రయోగమే ఇందుకు నిదర్శనం. వాటన్నింటికీ మూలం తరగతి గదిలో నాలుగు గోడల మధ్య విజ్ఞానాన్ని సముపార్జించే విద్యార్థుల మదిలో శాస్త్రీయ ఆలోచనలు వల్లే ఉంటుంది. చిన్నతనంలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తేనే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారు. గద్వాల పట్టణంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిణి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ షేక్ కలందర్‌బాషా, మీనాక్షిలు పూలమాలలు వేశారు.
- శాంతినగర్, వడ్డేపల్లి మండలంలోని రామాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్‌కు సంబంధించిన డ్రాయింగ్, వ్యాస రచణ ఉపన్యాస పోటీలు నిర్వహించారు.
- గట్టు మండలం తుమ్మలచెరువులో సీవీ రామన్ చిత్ర పటానికి హెడ్మాస్టర్ రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.
- మానవపాడు, జల్లాపురంలో ఎంఈఓ శివ ప్రసాద్, హెచ్ఎం విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.



గద్వాలలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులు



వడ్డేపల్లిలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నరసింహ

- ఎర్రవల్లి మండలంలో వివిధ తరగతుల విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన ఏర్పాటు చేశారు.
- మల్దకల్ మండలంలోని కుర్తిరావులచెర్వు, తాటికుంట, ఎల్కూరు, విఠలాపురం, అమరవాయి, బిజ్వారం, పాల్వాయి, మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌లలో అంతర్జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు.



పాతపాలెం పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు

- ధరూరు మండల కేంద్రంతో పాటుగా రేవులపల్లి, ఉప్పేరు, గార్లపాడు గ్రామాల్లో సైన్స్ దినోత్సవంలో ఎంఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.
- ఇటిక్యాలలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడి సైన్స్‌పై దృష్టి కేంద్రీకరించాలన్నారు.
- అయిజ మండలం, వివిధ గ్రామాల్లోని ఈజీ రైటింగ్, ఉపన్యాసం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.